క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఈపూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు మండల కో-ఆర్డినేటర్ యు.రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ఉచిత శిక్షణ, వసతి కల్పించి అనంతరం ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత విద్యార్హత సర్టిఫికెట్లు నకలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలు 83743 60175 నంబరులో తెలుసుకోవచ్చన్నారు.

కాకతీయ అన్నదాన సత్రానికి రూ.25 వేలు విరాళం

శావల్యాపురం: బొందిలిపాలెం గ్రామంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని అమ్మవారి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యుడు నాగుబడి వీరనారాయణ సోమవారం తెలిపారు. చినకంచర్ల గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (పెదబాబు), అరుణ దంపతులు రూ.25,116 చెక్కు రూపంలో అందజేశారని పేర్కొన్నారు.

ఘనంగా ఎల్ఈఎఫ్ చర్చి ప్రతిష్ట



నాదెండ్ల: అప్పాపురం దళితవాడలో నూతనంగా నిర్మించిన ది లెమన్ ఇవాంజికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ నూతన చర్చి ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల ఎల్ఈఎఫ్ ఇన్‌చార్జి కె.పీటర్‌పాల్ హాజరయ్యారు. ఆయనకు చర్చి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్తులే కాకుండా ఇతర గ్రామాల నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. చర్చికి ఆర్థికంగా సహకరించిన వారిని పేరుపేరున అభినందించారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమ సమన్వయకర్తగా మాజీ సైనికోద్యోగి దావల విలియంజోసఫ్, సంఘ పెద్దలు వ్యవహరించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కోయలమూడి సాంబశివరావు, నెల్లూరి హరిబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బాసట



నాదెండ్ల: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఆత్మసంతృప్తి ఉంటుందని జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. నాదెండ్ల గ్రామంలోని సచివాలయం సమీపంలో ఉన్న ఇల్లు ఇటీవల సిలిండర్ పేలి పూర్తిగా దహనమైన ఘటన విదితమే. బాధితుడు, వ్యవసాయ కూలీ పొత్తూరి రామయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం చెక్కు, కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మానుకొండ శేషిరెడ్డి, ఇమ్రాన్, శ్రీకాంతం పాల్గొన్నారు.

నేటి నుంచి ఇస్కాన్‌లో ఉగాది వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయం 11వ వార్షికోత్సవం, ఉగాది వేడుకలను ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం అదివాస పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 22న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మూలమూర్తులకు అభిషేకాలు, హారతులు, ఉదయం 10.30 గంటలకు ఉత్సవమూర్తులకు 54 రకాల ఫలద్రవ్యాలు, పంచామృతాలతో మహా శంఖాభిషేకం, మధ్యాహ్నం మహారాజభోగ నివేదన, సాయంత్రం 6.30 గంటలకు మూలమూర్తులకు 1008 కిలోల పూలతో మహాపుష్పాభిషేకం, అనంతం పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తారు. 23వ తేదీ, 24న రాత్రి 7.30 గంటలకు ఉత్సవమూర్తులకు తెప్పోత్సవం నిర్వహిస్తారని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నరసరావుపేట టౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు సోమవారం తెలిపారు. పెట్లూరివారిపాలెం గ్రామ వాగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా ఇసుక లోడు కలిగిఉన్న ట్రాక్టర్ గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

125 ఎకరాల్లో పంట నష్టం

దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



రావిపాడులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నరసరావుపేట రూరల్: అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. మండలంలోని రావిపాడు, పమిడిపాడు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లా రైతు శిక్షణా కేంద్రం కో-ఆర్డినేటర్ ఎం.శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, జిల్లా శిక్షణా కేంద్రం ఏడీఏ శివకుమారి, ఏవో నరేంద్రబాబు పర్యటనలో పాల్గొన్నారు. వర్షాల కారణంగా 125 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. నష్టం అంచనాను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కె.బ్రహ్మయ్య, గోపిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు గోపినాయక్, లావణ్య, ఉమారాణి, వీఆర్ఓ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వడగండ్ల వానతో నేలవాలిన మిర్చితోటలు

యడ్లపాడు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో యడ్లపాడు మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు పలు గ్రామాల్లోని మిర్చితోటలు నేలవాలాయి. కారుచోల, జాలాది, దింతెనపాడు తదితర గ్రామాల్లోని పొలాల్లో భారీ వడగండ్లు పడటంతో కాయలు రాలిపోవడంతో పాటు మొక్కలు సైతం విరిగి పడ్డాయి. చేలలో వడగండ్లు పడ్డ చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఆలస్యంగా సాగు చేసిన మిర్చి పొలాల్లో రెండో దశ కోతలు చేసే సమయంలో ఒక్కసారిగా వచ్చిన వర్షాలకు పంట నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారుచోల నుంచి జాలాది గ్రామానికి వెళ్లే మార్గంలోనూ పలుచోట్ల ఈదురుగాలులకు చెట్లు



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కూలాయి. భారీ వర్షానికి సాయంత్రం నుంచి మండలంలో సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో పల్లె ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ బృందం

రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు, మాచవరం, విప్పర్ల, ఎడ్వర్డ్‌పేట గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పైరును వ్యవసాయ అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ఈ బృందం పర్యటించింది. లేత దశలో ఉన్న మొక్కజొన్న పైరుకు, కోతకు సిద్ధమైన పైర్లకు సంబంధించి వ్యవసాయ



కాయలు రాలి, మొక్కలు పడిపోయిన దృశ్యం

అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ బృందంలో డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో విజయభాస్కర్, ఆయా గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

పిచ్చుక జాతి సంరక్షణతోనే మానవ మనుగడ

నాదెండ్ల: సెల్‌ఫోన్ టవర్ల రేడియేషన్, వాయు, శబ్ద కాలుష్యాల కారణంగా పిచ్చుక జాతి అంతరించే ప్రమాదంలో పడిందని హెచ్ఎం ఎ.గురులింగం ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అవనిగడ్డ హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. పంట ధాన్యాలు తినేస్తున్నాయన్న కారణంగా గతంలో చైనాలో పిచ్చుకల సంహారాన్ని పెద్ద ఎత్తున చేశారన్నారు. రెండేళ్ల కాలంలోనే చీడపీడల ఉధృతితో చైనాలో ఆహార ధాన్యాల దిగుబడి పతనమై ఆహార సంక్షోభం తలెత్తిందన్నారు. దీంతో నాటి నుంచి పిచ్చుకల పరిరక్షణకు చైనా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పిచ్చుక, ఇతర పక్షి జాతుల మనుగడతోనే మానవ మనుగడ ఆధారపడిందన్న



పిచ్చుక బొమ్మలు చిత్రించిన విద్యార్థులతో హెచ్ఎం గురులింగం, ఉపాధ్యాయులు

విషయాన్ని మరిచిపోరాదన్నారు. వేసవిలో పిచ్చుకల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేసి ధాన్యపు గింజలు ఉంచాలని కోరారు. అనంతరం విద్యార్థులు చిత్రించిన పిచ్చుకల బొమ్మలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరి శివకుమారి, వలంటీర్ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి వర్క్ టు రూల్ బాటలో ఉద్యోగులు

ఏపీజేఏసీ పల్నాడు జిల్లా చైర్మన్, యడ్లపాడు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు

యడ్లపాడు: ఇకపై రెవెన్యూ ఉద్యోగులు వర్క్ టు రూల్ కింద ప్రభుత్వ పనివేళల్లోనే విధులు నిర్వహిస్తామని ఏపీఆర్ఎస్ఏ, ఏపీజేఏసీ పల్నాడు జిల్లా చైర్మన్, యడ్లపాడు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై వీఆర్వోల సంఘం, కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల సమస్యల సాధనకు దశల వారీగా నిరసన కార్యక్రమాలకు కార్యాచరణ ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభించామన్నారు. ఇప్పటికే విధుల్లో ఉన్న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరిస్తున్నారన్నారు. మంగళవారం నుంచి ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యడ్లపాడు వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కేపీ చారి, కార్యదర్శి ప్రేమరాజ్, అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులు,



తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సర్వే, పౌరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రమోటెడ్ వీఆర్వోలకు ప్రొహిబిషన్ డిక్లేర్ చేసి పే-స్కేల్ అందించాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సంఘం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

23న వక్ఫ్ భూముల కౌలు వేలం

నాదెండ్ల: గొరిజవోలు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదుకు చెందిన వక్ఫ్ భూములకు ఈ నెల 23వ తేదీ మూడేళ్ల కాలానికి కౌలు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ కరిముల్లాబాషా తెలిపారు. 435 సర్వే నంబరులో 25.60 ఎకరాలు, 424లో 6.31 ఎకరాలు, 430లో 0.09 సెంట్లు మొత్తం 32.00 ఎకరాలకు గురువారం ఉదయం 10 గంటలకు సచివాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం అనంతరం హెచ్చుపాటదారుడు వెంటనే మిగిలిన మొత్తాన్ని చెల్లించి రశీదు పొందాలన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల దశలోనే విద్యార్థులకు బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలని సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ వెంటేశ్వరరావు తెలిపారు. బాల్య వివాహాలు, వాటివల్ల జరిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించి బాల్య వివాహాలను నివారించాలని సూచించారు. బాల్య



బాల్య వివాహాల అవగాహన ర్యాలీలో డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు

వివాహాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బాల వివాహాలు వద్దు-చదువే ముద్దు అంటూ ర్యాలీలో విద్యార్థులు నినదించారు. తొలుత బాల్య వివాహాల రద్దుపై విద్యార్థులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రవికాంత్, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీరాములురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశీనగర్ 1947 సినిమా షూటింగ్

అచ్చంపేట: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై మండలంలోని నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కాశీనగర్ 1947 సినిమా షూటింగ్ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తను అరెస్ట్ చేసే సన్నివేశాలను చిత్రీకరించారు. చిత్ర దర్శకులు జల్లు ప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యం ప్రాధాన్యతతో, సెంటిమెంట్ పండించే సన్నివేశాలతో కూడిన ఈ చిత్రాన్ని కేవలం పల్లె వాతావరణంలో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ప్రతినాయకుడుగా వల్లం చెన్నకేశవనాయుడు నటిస్తున్నారని వెల్లడించారు. నిర్మాతగా రాయదుర్గం రమాదేవిరెడ్డి, కెమెరామెన్‌గా జి.కృష్ణ, సంగీతం లక్ష్మణసాయి, పాటలు జి.సీతారామచౌదరి, ఎల్‌వీసీ రఘుబాబు, కొరియోగ్రాఫర్‌గా బండ్లరామారావు, ఫైట్స్ హుస్సేన్‌భాయ్ వ్యవహరిస్తున్నట్టు పేర్కొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చిలకలూరిపేట: విజయవాడలో ఇద్దరు న్యాయవాదులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం విధులను బహిష్కరించినట్లు చిలకలూరిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు తోట శివరామకృష్ణ, పి.శామ్యూల్‌జాన్, దాసరి చిట్టిబాబు తెలిపారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులైన న్యాయవాదులు ఎ.వెంకటభగవాన్, పి.ఉషారాణిపై కొందరు దాడి చేసి గాయపరచడం దారుణమన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, వేలూరు డొంక, రహమత్ నగర్, దాసరి కాలనీ, చీరాల రోడ్డు, గవర్నమెంట్ ఆసుపత్రి రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డాక్టర్ పీవీ సుబ్బారావుకు ఉగాది పురస్కారం



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ పీవీ సుబ్బారావు జిల్లా స్థాయి ఉగాది పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమాచారం అందినట్లు డాక్టర్ పీవీ సుబ్బారావు తెలిపారు. గతంలో ఆయన అధికార భాష సంఘం సభ్యుడుగా వ్యవహరించారు. గతంలోనూ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారు. అనేక సాహితీ విమర్శన గ్రంథాలు రాసిన ఆయనకు పురస్కారం లభించటం పట్ల పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలిపారు.

రేపు పంచాంగ శ్రవణం

యడ్లపాడు: స్థానిక రణవీరాంజనేయస్వామి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కొండకావూరి చంద్రశేఖరశర్మ, కార్యదర్శి మైదవోలు శేషగిరిరావు, కోశాధికారి పుసులూరి రంగాచార్యులు తెలిపారు. తమ సమాఖ్య తరపున ఈ నెల 22వ తేదీ ఉగాది పర్వదినం శోభకృత్ నామ సంవత్సరం నాడు పంచాంగ శ్రవణంతో పాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణం ప్రారంభం అవుతుందన్నారు. అనుమంచి శర్వణ్‌కుమార్ సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో వెంకట శ్రీవత్స పూజా కార్యక్రమం, అనంతరం అనుమంచి సూర్యప్రకాశరావుతో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రమేష్‌కుమార్ మృతదేహం

మాదల(ముప్పాళ్ళ): అతి వేగంగా వస్తూ రోడ్డు మార్జిన్‌లో ఉన్న చప్టా దిమ్మెను కారు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుర్ఘటన మాదల సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన మురుకుట్ల రమేష్‌కుమార్(68) కారులో నరసరావుపేట నుంచి సత్తెనపల్లి మండలం దూళిపాళ్ళలోని అత్తగారింటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మాదల సమీపంలోని పెట్రోల్‌బంక్ దాటాక రోడ్డు పక్కన ఉన్న చప్టా దిమ్మెను కారు వేగంగా ఢీకొట్టి పొలాల్లోకి పల్టీ కొట్టింది. రమేష్ కుమార్ కారులోంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు వేగానికి చప్టా దిమ్మె పూర్తిగా విరిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అటుగా వెళ్తున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

తిరునాళ్లను విజయవంతం చేయాలి

శావల్యాపురం: బొందిలిపాలెంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్లను ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని దేవాలయ కార్యనిర్వహణాధికారి పి.వెంకటరెడ్డి కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న ఉగాది పర్వదినం రోజున జరగనున్న తిరునాళ్లకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఉదయం 12 గంటల వరకు మాత్రమే వాహనాలు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ గల్లా రవికృష్ణ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు మూడు పార్కింగ్ స్థలాలు కేటాయించామని



సమీక్ష సమావేశంలో ఎంపీపీ, అధికారులు

చెప్పారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ తిరునాళ్లలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడాల వీరాంజనేయులు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్

శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పథంలో పయనించడానికి అభివృద్ధి కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో మండల స్థాయి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం అభివృద్ధిలో ప్రవాస భారతీయులు తమవంతు సహకారం అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉంటే సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండటంతో పాటు అంకిత



మాట్లాడుతున్న ఎంపీపీ

భావంతో విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, స్టాఫ్‌నర్సులు లక్ష్మీప్రసన్నకుమారి, ధనలక్ష్మి, ప్రమీల, సూపర్‌వైజర్లు సూర్యకుమార్, సాయిగీత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

యడ్లపాడు: కొండవీడు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా ప్రకృతి ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి ఆదేశాల మేరకు గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ జరిపారు. నవధాన్యాల సాగు, విత్తన గుళికల తయారీ విధానంపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 30 రకాల విత్తనాలను విత్తన గుళికలను చేసుకొని, ఒక ఎకరాకు 13 కిలోల చొప్పున రైతులు తమ పొలంలో చల్లుకోవాలని సూచించారు. దీంతో జీవవైవిధ్యం పెరగడంతో పాటు భూమి సారవంతమై పంట దిగుబడులకు దోహదపడుతుందని మాస్టర్ ట్రైనర్ మనోజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్



విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహమ్మద్‌యూనిస్ ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు పంచాయతీల్లో సిద్ధమైన ఓటర్ల జాబితా

నరసరావుపేట రూరల్: మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. కోర్టు కేసుల కారణంగా గతంలో నిలిచిపోయిన మండలంలోని లింగంగుంట్ల, రావిపాడు, కేసానుపల్లి, ఇస్సప్పాలెం, యల్లమంద గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమయింది. ఇందులో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. పంచాయతీ ఓటర్ల జాబితాలను ఈ నెల 18వ తేదీకి, ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాలను 21వ తేదీకి పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో పంచాయతీ అధికారులు ఐదు గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారు. శివారు ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో రావిపాడు పంచాయతీ పరిధిలోని 2324 ఓట్లు మున్సిపాలిటీలో కలిశాయి. లింగంగుంట్ల పరిధిలోని 1182 ఓట్లు, ఇస్సప్పాలెం పరిధిలోని 470 ఓట్లు, కేసానుపల్లి పరిధిలోని 962 ఓట్లు గతంలో కన్నా తగ్గాయి. లింగంగుంట్ల పంచాయతీ పరిధిలో గతంలో 7,692 మంది ఓటర్ల ఉండగా, ప్రస్తుతం 6,510 మంది, రావిపాడు పంచాయతీలో గతంలో 8,128 మంది ఓటర్లు కాగా, ప్రస్తుతం 5,804 మంది, కేసానుపల్లిలో గతంలో 3,793 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 2,831 మంది, ఇస్సప్పాలెం పంచాయతీ పరిధిలో గతంలో 2,800 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 2,330 మంది, యల్లమంద పంచాయతీ పరిధిలో గతంలో 3,790 మంది కాగా ప్రస్తుతం 3,805 మంది ఓటర్లు ఉన్నారు. ఆయా పంచాయతీల పరిధిలో ఓటర్లు తగ్గిపోవడంతో వార్డుల పునర్విభజన చేపట్టాల్సిఉంది. దీనిపై పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు మండల అధికారులు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల మేరకు వార్డుల పునర్విభజన చేపడతామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

దేవాలయం ఆవరణలోని విగ్రహాలు ధ్వంసం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవత అంకాలమ్మ దేవాలయ ఆవరణలో ఉన్న సిమెంటు విగ్రహాలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. నూతన దేవాలయ పనులు తుదిదశకు చేరుకున్న దశలో ఆలయ ఆవరణలోని అమ్మవారి సిమెంటు ప్రతిరూపాలను దుండగులు పగలగొట్టారు. మొత్తం 6 విగ్రహాలను పగలగొట్టారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దుండగులు ధ్వంసం చేసిన అమ్మవార్ల విగ్రహాలు

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

నాదెండ్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు కోరారు. గణపవరం ఆటో సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం, నాటి నుంచి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ మరోపక్క సామాన్య ప్రజలపై ఎనలేని భారాలు వేస్తున్నదని మండిపడ్డారు. ఏప్రిల్ 5న చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు విల్సన్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు